క్లుప్తంగా

తాండూరు ఏఓగా కొమరయ్య

తాండూరు రూరల్: తాండూరు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) గా కొమరయ్య నియమితులయ్యారు. గతంలో పని చేసిన ఏఓ రజిత పరిగి మండలానికి బదిలీ అయ్యారు. నూతనంగా వచ్చిన కొమరయ్య మహబూబ్‌నగర్ నుంచి వచ్చారు. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

చెల్లాపూర్‌లో సేవ్ హిందూస్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న గ్రామస్తులు

కుల్కచర్ల: మండలంలోని చెల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం 'సేవ్ హిందూస్' అనే నినాదంతో జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీలు నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో ఉద్దేశ పూర్వకంగా కొనసాగుతున్న అల్లర్లు, హత్యలు, దాడులు తదితర ఇబ్బందికర పరిస్థితుల నుంచి హిందువులను రక్షించాలని అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుల్కచర్ల బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కొండా ఆంజనేయులు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్



రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్

అనంతగిరి: రాఖీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఆయా విభాగాల్లో రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు చాంద్‌పాషాకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయన వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా కొడిపీర్ల పండగ



దోమ: హిందువులు, ముస్లింలు సంయుక్తంగా కలిసిమెలిసి నిర్వహించుకునే పండుగల్లో ప్రముఖమైనది పీర్లపండగ. శుక్రవారం దోమ మండలం పాలెపల్లి గ్రామంలో కొడిపీర్ల పండగను ప్రజలు సంబురంగా నిర్వహించుకున్నారు. అలయ్ ఆడుతూ కొడి పీర్ల పండగను ఆస్వాదించారు.

అవార్డు తీసుకోవడం సంతోషం

రావులపల్లి ఎఫ్ఏ శ్రీనివాస్



అవార్డు అందుకుంటున్న ఎఫ్ఏ శ్రీనివాస్

మర్పల్లి: స్పీకర్ గడ్డంప్రసాద్‌కుమార్, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఎఫ్ఏ శ్రీనివాస్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. 2023–24 సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా రావులపల్లిలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 90 శాతం కూలీ పనులు కల్పించామన్నారు. తమ సేవలను గుర్తించి ప్రభుత్వం అవార్డు అందజేసిందన్నారు. ఇక ముందు గ్రామం నుంచి ఏ ఒక్క రూ వలసలు వెళ్లకుండా స్థానికంగా కూలీ పనులు కల్పించేలా కృషి చేస్తానన్నారు. అవార్డు అందజేసిన స్పీకర్, జిల్లా కలెక్టర్‌కు, జిల్లా, మండల స్థాయి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త జీపీ ఏర్పాటుపై హర్షం

ధారూరు: మండలంలోని కేరెళ్లి గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉన్న కొండాపూర్ ఖుర్దును ప్రత్యేక గ్రామ పంచాయతీగా ప్రభుత్వం ప్రకటించడంపై శుక్రవారం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు కేరెళ్లి గ్రామానికి చెందిన వారి పాలనలో తమకు అంతగా ప్రాధాన్యం చేకూరలేదన్నారు. ఇక నుంచి మా గ్రామాన్ని మేమే పాలించుకునే అవకాశం వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక గ్రామ పంచాయతీ చేయాలని కోరామని, ఇన్నాళ్లకు మా కోరిక నెరవేరిందని మండల బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



పరిగిలో..



కొడంగల్‌లో..



కొడంగల్: అమ్మవారి పూజలో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో పూజలు

శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ఆయా ఆలయాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వరాలు ఇచ్చే వరలక్ష్మీ సిరులను ఇవ్వమ్మా అంటూ పాటలు పాడుతూ ప్రత్యేక పూజలు చేస్తూ అమ్మవారిని కొలిచారు. ఇస్తినమ్మా వాయనం– పుచ్చుకుంటినమ్మా వాయనం అంటూ ముత్తైదువులకు అరటిపండ్లు, తమలపాకులతో వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటూ వ్రతాలు చేసుకున్నారు.

–సాక్షి, నెట్‌వర్క్



అనంతగిరి: సరస్వతి శిశుమందిరంలో



పరిగి: అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



పెద్దేముల్: మంబాపూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు



మర్పల్లి: రామపూర్ గ్రామంలో..



ధారూరు: కపిలేశ్వరునికి ప్రత్యేక పూజ చేసిన భక్తులు



తాండూరు టౌన్ : రేణుకాఎల్లమ్మకు గాజులతో అలంకరణ



దుద్యాల్: హస్నాబాద్‌లో..



అనంతగిరిలో..



కోట్‌మర్పల్లిలో..

నాటడం.. నరకడం



బుద్దారం వద్ద నరికిన చెట్లు

పెద్దేముల్: హరితహారం కార్యక్రమంలో భాగంగా ఏటా లక్షల రూపాయలు ఖర్చు పెట్టి చెట్లు నాటడం, కరెంటు వైర్లకు అడ్డంగా ఉన్నాయంటూ నరకడం మండలంలో మామూలైంది. తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారిపై పెద్దేముల్ మండల బుద్దారం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లకు చెట్లు అడ్డు ఉన్నాయంటూ విద్యుత్ సిబ్బంది పెద్ద పెద్ద చెట్లను నరికి వేశారు. కాని సంబంధిత అధికారులు వాటిని చూసినా పట్టించుకోవడం లేదు. కాని, మండల ఉపాధి అధికారులు ప్రతి ఏటా మొక్కలను ఇష్టమొచ్చినట్లు పెంచడంతో లాభం లేదని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ వైర్లకింద రాకుండా మొక్కలు నాటాలని మండలంలోని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాబోయ్ కుక్కలు



ప్రధాన రోడ్లపై తిరుగుతున్న కుక్కలు

పెద్దేముల్: కుక్కల దాడులకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రధాన రోడ్లపై మందలుగా సంచరిస్తున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతం, ఎంఆర్‌కే కాలనీలో మాంసం దుకాణాల యజమానులు చికెన్ వేస్ట్ ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల రాత్రి, పగలు తేడా లేకుండా కుక్కలు రోడ్లపై సంచరించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి మాంసం దుకాణాల యజమానులు వేస్టేజ్ ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, వీధి కుక్కలు ప్రజలపై దాడులు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళలను కించపరిస్తే సహించం



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు



కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో..

పూడూరు: మహిళలను కించపర్చేలా మాట్లాడిన మాజీ మంత్రి కేటీఆర్‌కు బుద్ధి చెప్పేందుకు మహిళాలోకం సిద్ధంగా ఉందని పూడూరు పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మన్నేగూడ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బస్సులో మహిళలు ప్రయాణిస్తే బ్రేక్ డ్యాన్సులు చేస్తూ ప్రయాణిస్తున్నారని అవహేళన చేస్తూ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. అనంతరం మండల మహిళా అధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులకు మహిళలంటే గౌరవం లేకనే గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారని మండిపడ్డారు. మహిళలకు కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్, అజీంపటేల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు

దోమ : మహిళపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దిర్సంపల్లి ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ కార్యకర్తలతో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళపై ఎంతో చిత్తశుద్ధితో అనేక సంక్షేమ పథకాలను మహిళలకు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఓర్వలేకే అడ్డుగోలు మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, జయమ్మ, దిర్సంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

నవాబుపేట : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కేటీఆర్ వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం మండలంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: మహిళలపై మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు ఆవేదనకరమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలకు సంక్షేమ పథకాలు అందించడం ఓర్వలేని కేటీఆర్ అనునిత వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. బస్సుల్లో మహిళలు డ్యాన్సులు చేయడానికి పనికొస్తున్నాయని అనడం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, కుల్కచర్ల మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, జిల్లా యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌ను రెవెన్యూ గ్రామంగా ప్రకటించాలి

- కాంగ్రెస్ నాయకుడు మోహన్‌రెడ్డి



బంట్వారం: మండల పరిధిలోని బస్వాపూర్ పంచాయతీని రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ బంట్వారం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బస్వాపూర్, తొర్మామిడి రెవెన్యూ కింద ఉండటంతో ఇక్కడి ఆర్థిక వనరులన్నీ స్థానికులు కోల్పోవాల్సి వస్తుందన్నారు. గతంలో బస్వాపూర్, తొర్మామిడి గ్రామ పంచాయతీకి అనబంధంగా ఉండేదని, ఈ క్రమంలో సుమారు ఆరేళ్ల కిందట గ్రామ పంచాయతీగా ఏర్పడిందన్నారు. అయినప్పటికీ రెవెన్యూ పరంగా మాత్రం ఇప్పటికీ తొర్మామిడి కిందనే ఉందన్నారు. ఈ నేపథ్యంలో బస్వాపూర్‌కు సంబంధించిన రెవెన్యూ రికార్డులు తొర్మామిడిలో చూడాల్సి వస్తుందన్నారు. బస్వాపూర్‌ను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని, చాలాకాలంగా అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్వాపూర్‌ను రెవెన్యూ గ్రామంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి ఉర్సే షరీఫ్ ఉత్సవాలు

తాండూరు టౌన్ : ఈనెల 18 నుంచి 20 వరకు తాండూరు పట్టణంలోని ముర్షద్ దర్గాలో 78వ ఉర్సే షరీఫ్ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ముతావల్లి అల్హజ్ సయ్యద్ అబ్దుల్ గనిపాషా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రేపు (ఆదివారం) రాత్రి 7 గంటలకు గంధంతో ఇంటి నుంచి బయలుదేరి 8 గంటలకు దర్గా షరీఫ్ చేరుకుని సందల్‌మాలి నిర్వహించనున్నట్లు చెప్పారు. 19న దీపోత్సవం, రాత్రి 9.30 గంటలకు ఖవ్వాలి నిర్వహించనున్నట్లు తెలిపారు. 20న ఉదయాన్నే ఫజర్ తిలావత్ ఖురాన్ పాక్, ఉ.8 గంటలకు ఫాతెహాఖ్వాని, అనంతరం ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ప్రజలందరూ ఉర్సే షరీఫ్ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.



పట్టణంలోని ముర్షద్ దర్గా

పోరాటయోధుడు మంద కృష్ణమాదిగ



మంద కృష్ణను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు టౌన్ : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం కలిశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలులో ఆయన చేసిన కృషికి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా ఎస్సీ కులంలో వెనుకబడిన 57 ఉపకులాల తరఫున అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు మంద కృష్ణ అని కొనియాడారు. మాదిగల ఆత్మ గౌరవాన్ని కాపాడుతూ, ఇకపై అన్ని రంగాల్లో మాదిగలు అభ్యున్నతి చెందాలని వర్గీకరణ కోసం ఆయన చేసిన పోరాటం అనిర్వచనీయమన్నారు. మంద కృష్ణమాదిగను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ, అధికార ప్రతినిధి ప్రవీణ్‌మాదిగ, కార్యదర్శి అంజి, వెంకట్, అరుణ్ తదితరులు ఉన్నారు.

హత్యా రాజకీయాలు సరికాదు

బీజేపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి



ఎస్పీ ఆఫీస్ ఎదుట మాట్లాడుతున్న నేతలు

వికారాబాద్: బీజేపీ నాయకుడిపై అధికార పార్టీ నాయకులు హత్యాయత్నానికి యత్నించడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్‌రెడ్డిలు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం తెల్లవారు జామున పూడూరు మండల బీజేపీ అధ్యక్షుడు రాఘవేందర్‌ను వెంబడించారని ఆరోపించారు. సమాజంలో జరిగే తప్పు లను, అక్రమాలను సమస్యలను వెలికితీయడం రాజకీయంగా సాధారణమన్నారు. ఎన్కేపల్లి గ్రా మానికి చెందిన అసైన్డ్‌భూమిలో అక్రమాలు జరుగుతున్నాయని గ్రామస్తులతో కలిసి కలెక్టర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. దీనిని మనసులో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు రాఘవేందర్‌ను హత్య చేసేందుకు వెంబడించారని మండిపడ్డారు. హత్యా రాజకీయలకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని చన్గోముల్ పోలీస్‌స్టేషన్, వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాముయాదవ్, సినిమా సెన్సార్ బోర్డు మెంబర్ మల్లేష్‌పటేల్, జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నేడు శని త్రయోదశి

మోమిన్‌పేట: శని త్రయోదశి, శని అమావాస్య రోజున శనైశ్చరస్వామికి నల్లని నువ్వుల నూనెతో తైలాభిషేకం చేస్తే కోరిన కోర్కెలు తీరుస్తాడని భక్తుల ప్రగాఢ నమ్మకం. శనివారం శని త్రయోదశి కావడంతో మండల పరిధిలోని ఏన్కతల గ్రామంలో వెలసిన శనైశ్చరస్వామిని దర్శించుకోనేందుకు భక్తులు భారీగానే వస్తారు. అందుకు అనుగుణంగా ఆలయ కమిటీ అన్ని సదుపాయాలు కల్పించింది. భక్తులకు దర్శన మిచ్చేందుకు స్వామివారిని ముస్తాబు చేశారు.

సంప్రదాయ సాగు కనుమరుగు!

- తగ్గుతున్న ఆహార ధాన్యాల సాగు
- అధిక ధరలతో ప్రజలపై భారం

మోమిన్‌పేట: విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు పెరుగుతుండటం.. మరోవైపు గిట్టుబాటు ధరలు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో సంప్రాదాయ పంటల సాగు కనుమరుగుతోంది. పంటసాగులో వైవిధ్యం లోపిస్తుంది. వాణిజ్య పంట పత్తి, మొక్కజొన్నపైనే రైతులు ఆసక్తి చూపడంతో ఆహార ధాన్యాల సాగు తగ్గుతుంది. మండలంలో 22,560 ఎకరాల సాగు భూమి ఉంది. అందులో 25శాతం భూమి రియల్ వ్యాపారం వల్ల బీడుగానే ఉంది. 60శాతం భూమిలో కేవలం వాణిజ్య పంట పత్తిని సాగు చేస్తున్నారు. ఒకప్పుడు ఆహార ధాన్యాలకు పెద్దపీట వేస్తూ పచ్చజొన్న, తెల్లజొన్న, కొర్రలు, వరి, వేరుశనగ, కుసుమ, కంది, పెసర, మినుము, శనగ, అనుము, యవ్వలు, కూరగాయలు, వాణిజ్య పంట చెరుకు సాగు చేసేవారు. ప్రస్తుతం వీటన్నింటికంటే వాణిజ్య పంట పత్తి సాగు ఏటేటా పెరుగుతునే ఉంది. ఆహార ధాన్యాల పంటలు క్రమంగా తగ్గుతుండగా జొన్న పంట మండలంలో పూర్తిగా తగ్గింది. ఇలా ప్రతి గ్రామంలో ఆహారధాన్యాల పంటల సాగు తగ్గడంతో ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అప్పట్లో రైతులు కేవలం ఉప్పు మాత్రమే కొనుగోలు చేసేవారు. గతంలో జొన్నలు, కొర్రలు ప్రతి ఇంట్లో బస్తాల కొద్దీ నిలువ ఉండేవి. ప్రస్తుతం చాలా మంది రైతులు కొనుగోలు చేస్తున్నారు.

పత్తి సాగు అధికం

ప్రతి సంవత్సరం పత్తి సాగు పెరుగుతూనే ఉంది. గత నాలుగైదు సంవత్సరాలుగా రెట్టింపు విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. అదే స్థాయిలో ఆహార ధాన్యాల సాగు తగ్గుతుంది. బీటీ వచ్చిన తర్వాత పత్తిసాగు గణనీయంగా పెరిగింది. పప్పు ధాన్యాల సాగు వందల ఎకరాలకు తగిపోయింది. అది కూడా మొక్కజొన్నలో అంతర పంటగా కందిని మాత్రమే సాగు చేస్తున్నారు. కూరగాయల సాగు కొంత పెరిగిన, అసలు చెరుకు సాగు కన్పించడం లేదు.



ఎన్కేపల్లిలో జొన్నసాగు (ఫైల్)

ఆహార ధాన్యాల ధరలు పైపైకి..

ఏటేటా ఆహార ధాన్యాల ధరలు ఎగబాకుతున్నాయి. జొన్నలు, బియ్యం ధరలు ఆకాశనంటుతున్నాయి. మూడేళ్ల క్రితం బియ్యం క్వింటాలుకు రూ.మూడున్నర వేలు ఉండగా ప్రస్తుతం రూ.ఏడు వేల పైననే, పచ్చ, తెల్ల జొన్నలు రూ.ఆరు వేల పై మాటే. కంది, పెసర, మినప, శనగ పప్పు కిలోకు 50లోపు ఉండేది. ప్రస్తుతం రూ.140లకు తగ్గడం లేదు. నూనె ధరలు అంతే వేగంగా పెరుగుతున్నాయి. కేవలం రబీలో సాగునీటి వసతి ఉన్న రైతులు మాత్రమే జొన్న పంటను సాగు చేస్తున్నారు.

> **పత్తి సాగు చేస్తున్నా..**
>
> 
>
> అప్పట్లో పెసర, మినుము పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేవాళ్లం. రబీలో కుసుమ పంటను పండించే వారం. కూలీల కొరత, వాతావరణం అనుకూలించక పత్తి పంటను సాగు చేస్తున్నా. పప్పులను కొనుగోలు చేస్తున్నా.
>
> –నాగయ్య రైతు, ఎన్కేపల్లి

రసాయనిక ఎరువుల వినియోగం పెరిగింది..

సేంద్రియ ఎరువుల వినియోగం తగ్గి రసాయనిక ఎరువుల వినియోగం పెరిగింది. ఫలితంగా భూసారం తగ్గి వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. విచ్చలవిడిగా క్రిమిసంహార మందులు, రసాయనిక ఎరువులను వాడటం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తడిసి మోపెడవుతుంది. పంటలకు మేలు చేసే పక్షులు, కీటకాల సంతతి తగ్గింది. పంటల సాగులో వైవిధ్యం కనబరిస్తే చక్కటి ఫలితాలు వస్తాయి. ఎప్పుడు ఒకే పంట సాగు చేయకుండా మార్పిడి చేస్తే దిగుబడులు అధికంగా ఉంటాయి. ఆహార ధాన్యాల కొరత తీరుతుంది. రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వాడితే భూసారం పెరిగి పెట్టుబడులు తగ్గుతాయి.